


# అమెరి'కలకలం' కథలు

## – వంగూరి చిట్టెన్ రాజు



*10*

# ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్ కొంప ముంచిన ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్

ఈ తతంగం అంతటిలోనూ నాకు మొట్టమొదట బుర్రలో వెలిగి, అసంకల్పిత ప్రతీకార్య చర్యలా "ఓరి నాయనోయ్! ఆ ఇటాలియన్ ఆఫ్ డి ఈస్ట్ మన ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్ కొంప ముంచింది." అనేది నేను బాహాటంగానే వెలిబుచ్చిన...బుచ్చుకున్న వ్యక్తిగత అభిప్రాయం. మాములుగా అయితే మా క్వీన్ విక్టోరియా చుట్టుపక్కల లేనప్పుడే నేను అద్దం ముందు నా అందచందాలు నేనే చూసుకుని ఆనందిస్తూ, ద్విపాత్రాభినయనం చేసుకుంటూ, నాటకాలలో "ప్రకాశంగా" అనే డైలాగులలాగా నా ప్రగాఢమైన అభిప్రాయాలు పైకి వెలిబుచ్చుకుంటూ ఉంటాను. కానీ ఆ రోజు ఏమైంది అంటే నేనూ, ఆవిడా అమెరికాలో "తెకోరా" టీవీ అనగా తెలంగాణా, కోస్తా, మరియు రాయల సీమలన్నింటికీ చెందే తెలుగు టీవీ చూస్తూ, నరక బాధ అనుభవిస్తూ ఉండగా కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తరఫున డిగ్గీ రాజా సింగు గారు సడెన్ గా ముందుకు వచ్చి, "తెలంగాణా ఇవ్వబడును. తాంబూలాలు ఇచ్చేశాం కాబట్టి హైదరా'బాదు' ని పదేళ్ళ పాటు "హైదరా'బాధ' గా కలిసి తన్నుకు చస్తూ అనుభవించండి. అది చూసి నేనూ, తమిళ నాడు చిదంబరం గారూ, కేరళా ఏంటోనీ గారూ, కన్నడా మొయిలీ గారూ మహానందపడతాం" అని ఆదరాబాదగా, ఏ బాధా లేకుండా హిందీలో రాసుకున్న ప్రకటన వచ్చీ రాని ఇంగ్లీషులో చదివేశారు. నాకెందుకో టీవీలో తెర మీద కనపడిన మొహం డిగ్గీ గారి అగ్లీ మొహమే అయినా మనోనేత్రంలో కనపడింది మటుకు 'ఈ గొడవంతా ఏమిట్రా బాబోయ్' అంటూ ధుమ ధుమలాడుతూ ఉన్న సోనియమ్మ సీరియస్ మొహమే! ఘాట్టిగా వినపడింది ఆవిడ ఉవాచే! అంతా అమ్మ దయా, మన ప్రాప్తం.

ఆ మాటే మా క్వీన్ విక్టోరియా తో అనగానే "డిగ్గీ రాజా మొహానికేం. ఆ వయసుకి ఆ మాత్రం అయినా ఉన్నాడు. అదే నా రాజా అయితే ...." అని యింకా ఏదో ఎగస్త్రాగా అనబోతూ ఉంటే, నా మొహం మీద రాబోయే తీవ్ర పదజాలాన్ని బ్రిలియంట్ గా కనిపెట్టేసి ఆవిడని వారించడానికి "ఈ ఇటాలియన్ ఆఫ్ డి ఈస్ట్ ఆవిడ మన ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్ కొంప ముంచింది" అని ప్రవచించాను. "అదేమిటీ, రాబోయే తీవ్ర ప్రమాదాలని అంచనా వేసుకోకుండానే ఇంత తొందరగా ఈ విభజన ప్రకటన చేసింది ఈవిడ?" అని కూడా అన్నాను కొంచెం స్టోన్ వాల్యూం మేధావులు మాట్లాడినట్టుగా మార్చేసి.

"నీ మొహంలా ఉంది. తొందర అంటావు ఏమిటీ? నువ్వే కదా ఎప్పుడూ అనే వాడివి...ఇదేదో తొందరగా తేలితే బావుండునూ అని...ఆ మాట కొస్తే నాలుగైదు ఏళ్ల నుంచీ 'మా అభిప్రాయాలు మేము చెప్పేసాం. మరి మీ అభిప్రాయం చెప్పరేం?' అని అందరూ ఆవిడని నిలదీశారుగా. పాపం అందరినీ అడిగి ఉత్తరాలు పుచ్చుకుని, శ్రీ కృష్ణ కమిటీ వేసి, అది చదవకుండానే తనకి కావలసిన టైం లో తన అభిప్రాయం చెప్పింది కదా! అందులో తప్పేమిటీ?".

"సర్లే..ఎలాగో అలాగా రాహుల్ ని ప్రధాన మంత్రిని చెయ్యడానికే ఇప్పుడు తెలంగాణా ఇస్తోంది. ఆ మాత్రం తెలీదా అందరికీనీ" అన్నాను...పొరపాటున.

"ఓయ్ వెర్రి నాయనా. నువ్వు ఈ టీవీ టాక్ షో లు మరీ ఎక్కువగా చూస్తూ అవే డైలాగులు చెప్తున్నావు. రాహుల్ ప్రధాన మంత్రి కావాలంటే ఎప్పుడో అయిపోయే వాడు. కానీ ఇప్పుడేమో అసలు ఆ కుర్రాడు ఎన్నికలలో నిలబడి నెగ్గడానికి ఇదివరకు ఇండియా మొత్తం మీద ఇందిరా గాంధీకి మెదక్ జిల్లా లాగా ఇప్పుడు రాహుల్ కి కూడా తెలంగాణా ఒక్కటే గేరంటీ అని తెలిసిపోయిందేమో మరి. అందుకే ఈ తెలంగాణా ఇవ్వడం. అర్ధం అయిందా?" అని మా క్వీన్ విక్టోరియా గల, గలా నవ్వింది. మామూలుగా అయితే ఆవిడ నవ్వితే బావుంటుంది కానీ, ఈ సారి నోబుల్ ప్రైజ్ వచ్చిన రచయిత నా కథలు చదివి జాలిగా నవ్వుకున్నట్టుగా ఉంది. మరో క్షణంలో ఆవిడ మొహంలో రంగులు మార్చి, "రాజకీయాలు మనకెందుకు కానీ ఇందాకా ఏమిటీ నీ కొంప ములిగిందీ అని ఏమిటో అన్నావు. నీకు అసలు కొంప ఎక్కడుందీ ములగడానికీ? కొంప తీసి ఎక్కడైనా రెండో ఏర్పాటు ..." నా మీద విపరీతమైన అనుమాన భూతం పెనునుగులాడుతున్న ధ్వని ఆవిడ గొంతులో వినపడింది.

అసలు విషయం లేదా నా మీద కంప్లైయింట్ ఏమిటంటే... నాకు అందరి ఎన్నారైల లాగా ఇండియాలో కనీసం ఒక వంద చతురపు అడుగులకే కోటి రూపాయలు విలువ చేసే సింగిల్ బెడ్ రూము ఫ్లాట్ కూడా లేదు. అమెరికాలో ఉన్న ఇల్లు కూడా ఇక్కడి పద్ధతి ప్రకారం నేను బతికున్నంత కాలం బేంక్ వాడి తాకట్టు లోనే ఉంటుంది. ఈ లోగానే బేంక్ వాడు బాల్చీ తన్నేస్తే ..అంటే దివాళా తీసేస్తే వాడి స్థానం లో ఒబామాయో మరో మార్వాడీ వాడో నా దగ్గర బాకీ వసూలు చేస్తారు కానీ కొంప మటుకు నా పేరిట వ్రాసి ఇవ్వరు. అంచేత సొంత ఇల్లు నాకు ఒకటి ఉన్నా లేనట్టే లెక్క.

అందుకే "నా మొహానికి అంత భాగ్యం కూడానా? నేను అనేది నా సాహిత్యం కొంప గురించి మహా తల్లీ. అసలు ఇల్లు ములగడం గురించి కాదు" అన్నాను మా క్వీన్ విక్టోరియా తో.

"సాహిత్యం కొంపా? అదేమిటీ. ఏదో దుష్ట సమాసం లాగ ఉందే" అని తెలుగులో మళ్ళీ నవ్వింది మా ఆవిడ. "అవునూ, నువ్వు ఇటాలియన్ ఆఫ్ 'డి' ఈస్ట్ అని ఒక సారి అంటావు 'ది' ఈస్ట్ అని ఇంకో చోట అంటావు. మేక్ అప్ యువర్ మైండ్" అని నా సెన్స్ ఆఫ్ హ్యూమర్ కి గండి కొట్టేసింది మా క్వీన్ విక్టోరియా.

"ఈ సమాసాలు, సమోసాలు మనకి తెలియవు కానీ, నీ బారి నుంచి తట్టుకోడానికి ఎప్పుడూ నేను తలదాల్చుకునేది సాహిత్యం లోనేగా అనేసి నాలిక్కరుచుకుంటూ ఉండగానే నా రోజు వారీ తాయిలం ఇచ్చేసి ...అదే... టెంకి జెల్ల..కొట్టేసి తుర్రుమంది మా క్వీన్ విక్టోరియా.

ఇంతకీ ఈ తెలంగాణా వేర్పాటు...క్షమించాలి ఇక్కడ తట్ట, బుట్ట పట్టుకుని వేరు పడుతున్నది సీమాంధ్రా కదా....ఏదైతేనేం, మరో కొన్నేళ్లలో ఇటాలియన్ ఆఫ్ 'ద' ఈస్ట్ అని ఊదరగొట్ట బడే తెలుగు భాష అతీ, గతీ ఏమిటీ అనేదే నాకు బొత్తిగా సమజ్ కాని అసల్ సవాల్. ఉదాహరణకి కొన్నేళ్లలో కన్నడం నుంచి తెలుగు విడిపోయినట్టు తెలుగు నుంచి తెలంగాణా భాష కూడా కొత్త భాషగా అయిపోతుంది గదా. అందుకని ఇప్పుడే తెలంగాణా సాహిత్య ఎకాడెమీ ఒకటీ, సీమాంధ్రా సాహిత్య ఎకాడెమీ ఒకటీ ఎవరికీ వారు విడిగా వేసుకుని ఎవరి వీర తాడులు వారు వేసుకుంటారా? అంతే కాదు, కాకినాడ నుంచి గరికిపాటి వారూ, రాజమండ్రి నుంచి బేతవోలు గారూ, అలాగే సాహిత్యావకాశాల కోసం హైదరాబాద్ 'వలస' వచ్చి సెటిల్ అయిపోయిన అనేక మంది తెలుగు అవధానులు, పండితులు మళ్ళీ వెనక్కి వెళ్ళిపోదురా? ఇక కేంద్ర ప్రభుత్వం వారు జ్ఞానపీఠం బహుమతికి తెలంగాణా భాషని విడిగా చూస్తారా లేక తెలుగు తోటే కలిపేసి చూస్తారా, అసలు పూర్తిగా మన భాషని విస్మరిస్తారా, లేక మళ్ళీ శ్రీ కృష్ణారెడ్డి కమిటీయో, జస్టిస్ చౌదరి కమిటీయో వేస్తారా? అప్పుడెప్పుడో "తెలుగుని ప్రాచీన భాషగా ప్రకటించినా, యింకా విడుదల చెయ్యని కోట్ల రూపాయలు ఎలా పంచుకుంటారు? కూచిపూడి వారిదా, వీరిదా, అసలు ఎవరిదీ కాకుండా పోతుందా?

ఇక, తెలుగు భాష మనుగడ మీదనే ఆధార పడిన ఆంధ్ర జ్యోతి , ఆంధ్ర ప్రభ, విశాలాంధ్ర లాంటి ప్రయివేటు పత్రికలు సీమాంధ్ర జ్యోతి - తెలంగాణా జ్యోతి అని రెండు పత్రికలాగా విడి పోయి, వారి భవనంలో పై రెండు అంతస్తులు ఒకరు, క్రింద రెండు అంతస్తులు మరొకరు పంచుకుని పదేళ్ళ పాటు ఎవరి ప్రాంతాల మాన భంగాలని, దోపిడీలనీ వాళ్ళే ప్రచురించుకుంటూ, లేదా మైలేజ్ కోసంల్, రివర్స్ గేర్ లో అక్కడి మాన భంగాలని ఇక్కడి వాళ్ళూ, ఇక్కడి దోపిడీలని అక్కడి వాళ్ళూ ప్రచురించుకుని శునకానందం పొందుతారా, లేదా అందరూ మూకుమ్మడిగా తిట్టే ఒక్క అమెరికా వార్తలు మాత్రమే కలిసి వేసుకుంటాయా? వారికి రెండు రాష్ట్రాల ప్రభుత్వాల వారూ ప్రకటనలు ఇస్తారా? అస్సలు ఎవ్వరూ ఇవ్వక ఆ పత్రికలూ మూసేసుకునే పరిస్థితి వస్తుందా?

ఇక టీవీ నైన్, ఈటీవీ లాంటి చానెళ్ళ పరిస్థితి ఏమిటి? టీవీ నైన్ –తె అని ఒక ప్రాంతానికీ, టీవీ ఫైవ్ - కో అని మరో ప్రాంతం వార్తలకీ, ముందు చూపుగా టీవీ నైన్ - రా అని రాయల సీమ వారికీ విడి, విడిగా సమయం కేటా ఇస్తారా? లేదా, ఈ - టీవీ ఒకటీ, రెండు, రెండున్నర అని పెట్టుకుంటూ పోతారా? మా ప్రాణాలకి ఇవన్నీ కూడా అమెరికాలో ప్రసారం అవుతాయా?

అట్లయినచో ఇప్పటికే ఇండియా వాళ్ళు ఎవ్వరూ చూడని అమెరికా వాళ్ళ ఛానెళ్ళు మూతపడునా లేక కరీం నగర్ కీ, కాకినాడకీ ఔట్ సోర్స్ చెయ్యబడునా?

తన పిల్లలకి అక్కడి స్కూళ్ళలో తెలుగు నేర్పడం లేదు అనే కారణం చెప్పి మద్రాసు నుంచి హైదరాబాద్ తరలి వచ్చి ఇక్కడ టాలీవుడ్ నిలదొక్కుకోడానికి ప్రేరణ కల్పించిన అక్కినేని ఈ తొంభై ఏళ్ళ వయసులో ఇప్పుడు హైదరా'బాధ' వదిలేసి ఎక్కడికి పోతాడు? పోయెనుబో, నాగార్జున కూడా వచ్చునా? రామానాయుడు అనంతపురం పోవునా విశాఖకు పోవునా? ఈ సినిమా పరిశ్రమలో ఎవరు ఎక్కడికి పోయిననూ, పోకపోయిననూ, ఏ ప్రాంతం బూతు సినిమాలు వారే నిర్మించు కొనెదరా? ఏ ప్రాంతపు ద్వంద్వార్ధ రచయితలు ఆ భాషలోనే వ్రాయుదురా? లేక ఆ మాటలకు అర్ధమూ, ప్రతి పదార్ధమూ అన్ని భాషలోనూ ఒక్కటే కాబట్టి అడ్జస్ట్ చేసుకునెదరా? ఇక తెలుగు, తమిళం, కన్నడం లో ఒకే సారి కొన్ని సినిమాలు షూట్ చేసినట్టు రెండు తెలుగు భాషలోనూ ఒకే సారి తీయుదురా, లేక డబ్బింగ్ చేయుదురా? ఇక హైదరాబాద్ లో తీసిన సినిమాలని టాలీవుడ్ అని పిలిస్తే, కొత్త రాజధాని లో సీమావుడ్ అనో ఆంధ్రావుడ్ అనో కొత్త "జంక్ వుడ్" పుట్టుకొచ్చునా? సినిమా వాళ్లకి ఎవార్డులు ఇచ్చి బతికే వారి పరిస్థితి ఏమిటి?

ఇంతకీ టేంక్ బండ్ మీద కొత్త విగ్రహాలు ప్రతిష్టాపించడానికి అడ్డొచ్చిన కొన్ని విగ్రహాలు హుస్సేన్ సాగర్ లో పారవేయుదురా? లేక కాళ్ళూ, చేతులూ కట్టేసి సీమాంధ్ర వారికి కేంద్రం కేటాయించిన గోడౌన్ లో పడేసి, కొత్త రాజధాని కట్టాక అక్కడ మళ్ళీ కట్లు విప్పుతారా? కొత్త రాజధానికి వైజాగ్ లో లాగో, కాకినాడ లో లాగో ఒకానొక సముద్రం ఒడ్డు ఉంటే పరవా లేదు కానీ ఒక వేళ ఏ కర్నూలు లాగానో, ఒంగోలు లాగానో ఉంటే అక్కడ ఒక పెద్ద "సీమాంధ్రా గొయ్యి" తవ్వి, కేసీఆర్ గారి దగ్గర అప్పు పుచ్చుకున్న నీళ్ళ తో నింపేసి దాని చుట్టూ సుందర నందనవనంలో ఆయా విగ్రహాలు పునఃప్రతిష్టాపన చేస్తారా? 'ఎవరి తీసుకున్న గోతిలో వారే పడుదురు' అన్న సామెత ఇప్పుడు తెలుస్తున్నదే కదా! అందు వలన అంత రిస్క్ తీసుకుందురా?

ఇవన్నీ ఎలా ఉన్నా, పదేళ్ళు హైదరా"బాధ" లో ఉమ్మడి రాజధానిలో ఎలా "కాపురం" చేస్తారు? లేదా హైదరాబాద్ ని తెలంగాణాకీ, సికిందరాబాద్ ని సీమాంధ్రాకి కేటాయిస్తారా? ఆ సమస్యకి జీవితాలనే మార్చేసే ఒక ఐడియా నాకు వచ్చింది. అదేమిటంటే, ఇప్పుడు ఉన్న సచివాలయానికి ముందుగా "దుశ్శాసన సభా ప్రాంగణము" అని అందరికీ సరిగ్గా అతుక్కునే పేరుగా మార్చెయ్యాలి. ఇక పొద్దున్న 8 నుంచి మధ్యాహ్నం 12 దాకా "తెలంగాణా దుశ్శాసన సభ" అని బోర్డు పెట్టాలి. ఆ సమయంలోనే ఆ రాష్ట్ర శాసన సభ్యులు మైకులు మాత్రమే విరగ్గొట్టుకునీ, బల్లలూ, కుర్చీలూ విసిరేసుకుని తెలంగాణా ని అభివృద్ధి చేస్తారు. మధ్యాహ్న భోజన విరామం సమయంలో ఆ బోర్డుని "సీమాంధ్రా దుశ్శాసన సభా ప్రాంగణము" అని కేంద్రం పంపించిన ఆర్మీ బెటాలియన్ వారు మార్చేస్తారు. మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 5 వరకూ పొద్దుటి సభలో విరిగిపోగా మిగిలిపోయిన కుర్చీలు, బల్లలు, మైకులు వగైరాలు గౌరవనీయులైన సీమాంధ్రా సభ్యులు పూర్తి చేసి తమ ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకుంటారు. కొన్నాళ్ళకి విరగగొట్టడానికి ఏమీ మిగలక ముష్టి యుద్ధాలు చేసుకుని, కాళ్ళు, చేతులు విరిగాక నేల మీదనే చతికిల పడి చట్టాలు చేసుకుంటారు.

అక్కడా, ఇక్కడా ప్రజలందరూ చట్టుబండలుగానే మిగిలిపోతారు. రాహుల్ గారు కేంద్రంలో దేశం అంతానూ, ముఖ్యంగా ఇతర దక్షిణాది రాష్ట్రాలు సుభిక్షంగా ఉండేలా పరిపాలన సాగిస్తూ ఉంటారు.

ఇక అమెరికా సంగతికి వస్తే, మరిన్ని ప్రశ్నలు తలెత్తును కదా! ఉదాహరణకు, నిన్ననే ఒక ప్రకటన చూసాను. అమెరికాలో ఫలానా నగరంలో కొత్తగా 'షురూ' చేసిన "ఫలానా నగర తెలంగాణా సంఘం" వారి కల్చరల్ ప్రోగ్రాం లో సాంగ్స్ పాడేది మన తెలంగాణా పోరి అని నాకు తెలిసినమ్మాయి పేరే ఉంటే కొంచెం ఆశ్చర్య పోయాను. ఎందుకంటే ఆ అమ్మాయి తల్లిదండ్రులు టు.గొ.జిల్లా వారే కానీ ....(తూ.గో .జిల్లా వారందరూ ఉద్యోగాల కోసం టు.గొ గా మారి పోయి హైదరాబాద్ వెళ్లి పోయారుగా...అందుకే జిల్లా పేరు కూడా మారింది.). ఎన్టీఆర్ జూనియరూ, ఆ అమ్మాయీ, హైదరాబాద్ లోనే పుట్టారు కాబట్టి కేసీఆర్ లెక్క ప్రకారం ఆ అమ్మాయి "తెలంగాయని" కదా. ఎన్టీఆర్ మరి "తెలంగానాయకుడు" కావాలి కదా! ఇక ముందు అమెరికా తెలుగు సంఘాలన్నీ తాము ఏం ప్రాంతం వారో చెప్పుకోవాలా? నా బోటి సాధారణ వ్యక్తులకి ఏమీ పట్టక పోయినా, విరాళాల కోసం, ఇతర రాజకీయ, సామాజిక, సినిమా కారణాల కోసం 'తె-తానా', 'సీమా-ఆటా, తెకోరా-నాట్స్ అటూ-ఇటూ నాటా అనే కొత్త విభాగాలో, పేరు మార్పిడీలో చేసుకుంటారా?

ఇలా నాకు కలిగిన సవా లక్ష అనుమానాలతో, "ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్"..అనగా తెలుగు భాషా, సాహిత్యాల సమస్యని తేల్చి చెప్పాక తన నిర్ణయాన్ని అమలు పరచమనీ, ఆ మాట కొస్తే అసలు హైదరాబాద్ అనే పేరు ఎవరికీ అచ్చి రాలేదు అనీ, అందు వలన ఒరిజినల్ పేరు అయిన "భాగ్య నగర్" గా మార్చమనీ కూడా నేను మేడం ని అర్థించదల్చుకున్నాను. ఆఫ్టరాల్, మెద్రాస్ ని చెన్నై గాను, బోంబే ని ముంబై గానూ మార్చేసుకుని వాళ్ళు బాగుపడ్డారు కాబట్టి మాకేం రోగం అని కూడా ప్రశ్నిస్తూ 'ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్' అమ్మ గారికి ఎస్.ఎం.ఎస్. ఇచ్చాను. నేను ఎన్నారై ని కాబట్టి రేపో, ఎల్లుండో ఆవిడ స్పందించి తీరతారు అనే నా నమ్మకం.

హైదరాబాద్ కి నా పేరు మార్పిడి సూచన వినగానే "వెర్రి హస్బెండూ, ఆ పని మటుకు చెయ్యకు. ఒత్తులు పలక లేని మన టీవీ యాంకర్లూ, రాజకీయ నాయకులూ, ఆఖరికి విశ్లేషకులూ దాన్ని ముందు సాఫ్ట్ గా 'బాగ్య' నగరం అనీ..అదీ పలక లేక పొతే 'అబాగ్య నగర్" అనీ మన బండారం బైట పెట్టేస్తారు. అదే మన అసలు దౌర్భాగ్యం. పైగా స్కూల్లో తెలుగు మాట్లాడినందుకు మెడలో అట్టలు వేళ్ళాడ గట్టి పిల్లల్ని ఎండలో నుంచో బెట్టినప్పుడు రాని ఉద్యమం ఇప్పుడు వచ్చిందంటే, దాని అర్థం సీమాంధ్రులకి ఉన్నది తెలుగు భాష మీద ప్రేమ కాదు- ఉన్న తెలుగింగ్లీషు ఉద్యోగాలు, అమెరికా వీసాలు పోతాయేమో అని మాత్రమే. ఎన్ని రాష్ట్రాలుగా విడిపోయినా నువ్వూ, నీ సాహిత్యమూ ఎక్కడ వేసిన గొంగళీ అక్కడే!" మా క్వీన్ విక్టోరియా గల, గలా నవ్వింది. ఈ సారి ఎందుకో ఆవిడ నవ్వు అచ్చు "నాకు తెలుసోచ్ "అనే సోనియా నవ్వులా ఉంది.

నిజం చెప్పొద్దూ...ఆ మాట నేను నమ్మను. ఎందుకంటే..ఈ సెప్టెంబర్ **29** నుండి అక్టోబర్ **5, 2013** దాకా వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా హైదరాబాద్ (శ్రీ త్యాగరాజ గాన సభ, సాయంత్రం **5** నుంచి) లో నిర్వహిస్తున్న "మొట్టమొదటి జాతీయ యువతరం సాహిత్య సమ్మేళనానికి" ఆంధ్ర ప్రదేశ్ లో ఉన్న **23** జిల్లాల నుంచీ, నాలుగు ఇతర రాష్ట్రాల నుంచీ మొత్తం **150** మంది

యువ సాహితీ వేత్తలు, రచయితలూ వక్తలుగా నమోదు చేసుకున్నారు. తెలుగు భాష, సాహిత్యమూ రాజకీయాలకి అతీతం అనీ, ఈ నాటి యువతరం ఆ అంశాలకి తగిన ప్రాధాన్యత ఇస్తోంది సుమా అని చెప్పడానికి, ప్రస్తుత పరిస్థితులలో మేము ఊహించని ఈ అనూహ్య స్పందన చాలు. నేను ఆ వారం రోజులూ హాయిగా ప్రేక్షకులలో కూర్చుని యువతరం సాహిత్య సంపదని అనుభవిస్తాను. ఈ "కౌముది" చదివిన పాఠకులు ఎవరైనా వస్తే హాయిగా పలకరిస్తాను.

మా బ్లాగ్: www.vangurifoundation.blogspot.com

COMMENTS